www.nagaranijam.com
PRGI/RNI NO : APTEL/2013/54450

నగరనిజం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు విలేకరులు కావలెను ఆసక్తి ఉన్నవారు ఈ క్రింది నెంబర్ ఫోన్‌కి చేయగలరు : ☎8247467562
Email Id : nagaranijam@gmail.com
Website : www.nagaranijam.com

# నగరనిజం

www.nagaranijam.com
అక్షరనిజం నగరనిజం
తెలుగు దిన పత్రిక

NN TV
TELANGANA
నగర నిజం

సంపుటి : 14 | సంచిక : 25 | ఉమ్మడి రంగారెడ్డి | సంపాదకులు : ఏలె. పురుషోత్తం | 18,శనివారం,ఏప్రిల్ 2026 | పేజీలు : 4+ | ₹ 3

Volume : 14 | Issue : 25 | Rangareddy | Editor : Yela Purushotham | 18,Saturday,April,2026 | Pages : 4+ | Price : 3/-

Published From Rangareddy, Circulated by Hyderabad, Nalgonda, Khammam, Karimnagar, Warangal, Mahaboobnagar, Medak, Nizamabad, Adilabad

## సౌత్ జోన్ ఫెస్టివల్‌లో సాయికిరణ్ ప్రతిభ తెలుగు విశ్వవిద్యాలయంలో సత్కారం

**సౌత్ జోన్ ఫెస్టివల్‌లో సాయికిరణ్ ప్రతిభకు ఘనంగా గుర్తింపు.**



కూకట్పల్లి,ఏప్రిల్ 17,(నగర నిజం ప్రతినిధి) :సూరవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం థియేటర్ ఆర్ట్స్ విభాగంలో అభ్యసిస్తున్న విద్యార్థి బి. సాయికిరణ్ ప్రతిభతో మరోసారి గుర్తింపు పొందారు.గత సంవత్సరం డిసెంబర్‌లో చెన్నైలో నిర్వహించిన సౌత్ జోన్ ఫెస్టివల్ లో సాయికిరణ్ వన్ యాక్ట్ ప్లే, మైమ్, క్రియేటివిటీ కొరియోగ్రఫీ విభాగాల్లో పాల్గొన్నారు. అందులో వన్ యాక్ట్ ప్లేలో నాలుగో స్థానం సాధించగా, మైమ్‌లో ప్రధాన పాత్ర పోషించి నాలుగో స్థానం పొందారు.ఈ సందర్భంగా గురువారం రోజు సూరవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో మహనీయుల జయంతి వేడుకల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు చేతుల మీదుగా సాయికిరణ్ సర్టిఫికెట్లు అందుకున్నారు.ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య నిత్యానందరావు,రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతు రావు, సినీ నటుడు ప్రదీప్, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ కృపాకర్ పాల్గొన్నారు. విద్యార్థి సాయికిరణ్ సాధించిన విజయానికి విశ్వవిద్యాలయం విద్యార్థులు, అధ్యాపకులు, వివిధ విభాగాల సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## శంషాబాద్ విమానాశ్రయంలో కోటి రూపాయల విలువైన గంజాయి పట్టివేత

**3 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్న కస్టమ్స్ అధికారులు**

**బ్యాంకాక్ నుండి హైదరాబాద్ వచ్చిన ఇద్దరు మహిళా ప్రయాణికుల అరెస్ట్**

**నిందితులపై ఎన్.డి.పీ.ఎస్ యాక్ట్ కింద కేసు నమోదు**



రాజేంద్రనగర్, ఏప్రిల్ 17(నగరనిజం ప్రతినిధి):శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో మరోసారి భారీగా విదేశీ గంజాయి పట్టుబడింది. బ్యాంకాక్ నుండి హైదరాబాద్ వచ్చిన ఇద్దరు మహిళా ప్రయాణికుల నుండి సుమారు కోటి రూపాయలకు పైగా విలువచేసే విదేశీ గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు కస్టమ్స్ అధికారులు ప్రకటించారు. కస్టమ్స్ అధికారుల కథనం ప్రకారం.... బ్యాంకాక్ నుండి థాయ్ ఎయిర్ లైన్స్ విమానంలో హైదరాబాద్ వచ్చిన ఇద్దరు ప్రయాణికులు... తమ లగేజీ బ్యాగుల్లో హైడ్రోపోనిక్ గంజాయి ప్యాకెట్లను దాచుకొని వచ్చారు. అయితే శంషాబాద్ విమానాశ్రయంలో ల్యాండ్ అవగానే వీరి లగేజీ బ్యాగులను స్కానింగ్ చేసిన కస్టమ్స్ అధికారులు.... గంజాయి అక్రమ రవాణా గుట్టును రట్టు చేశారు. ఈ మేరకు వీరి లగేజీ బ్యాగుల్లో దాచిన 2.95 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్న కస్టమ్స్ అధికారులు.... నిందితులపై ఎన్ డి పి ఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నారు. పట్టుబడిన గంజాయి విలువ బహిరంగ మార్కెట్లో కోటి మూడు లక్షల రూపాయలు ఉంటుందని కస్టమ్స్ అధికారులు ప్రకటించారు.

## సచివాలయ ఉద్యోగులకు శాపం.. ఆర్టీసీ కార్మికులకు ద్రోహం

**రేవంత్ రెడ్డికి మాత్రం కేవలం పబ్లిసిటీ వ్యామోహం!**

**బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు**



హైద్రాబాద్ ఏప్రిల్ 17 (నగరనిజం న్యూస్):తెలంగాణలో పాలన గాలికి.. కాంగ్రెస్ అరాచకంలో సామాన్య ప్రజలు, కార్మికులు, చివరకు ప్రభుత్వ ఉద్యోగులు కూడా రోడ్లెక్కి నిరసన తెలపాల్సిన దుస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిస్థితులు ఆవేదన కలిగిస్తున్నాయి. ప్రజా సమస్యలు పరిష్కరించే నిలయం సెక్రటేరియట్ లోనే ఇవాళ ఉద్యోగులు 'భోజన విరామ నిరసన' చేస్తున్నారంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత అసమర్థంగా ఉందో అర్థమవుతోందని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు విమర్శించారు. పీఆర్సీ అమలు లేదు, పెండింగ్ డీఏలు రావు, హెల్త్ కార్డులు పనిచేయవు. చివరకు కాంగ్రెస్ పార్టీలో మేనిఫెస్టోలో పెట్టిన ఓపీఎస్ (ప్రారా) హామీని కూడా గాలికొదిలేశారు. సచివాలయ ఉద్యోగులకే దిక్కులేకపోతే, ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏంటి?రాష్ట్రంలో న్యాయమైన డిమాండ్ల కోసం రోడ్లెక్కిన తెలంగాణ సచివాలయ ఉద్యోగుల 'భోజన విరామ నిరసన'కు, అలాగే ఈ నెల 22 నుంచి సమ్మెకు సిద్ధమవుతున్న ఆర్టీసీ కార్మికులకు భారతీయ జనతా పార్టీ తన సంపూర్ణ మద్దతును ప్రకటిస్తోందని టిలిపారు. ఉద్యోగ, కార్మిక వర్గాల హక్కుల సాధన కోసం బీజేపీ ఎప్పుడూ ముందుండి పోరాడుతుంది.అటు ఆర్టీసీ కార్మికులు తమ హక్కుల కోసం, విలీనం కోసం ఏప్రిల్ 22 నుంచి సమ్మెకు వెళ్తున్న ఆర్టీసీ కార్మికులను చూసి ప్రభుత్వం వణికిపోతోంది. అందుకే కొన్ని జేఏసీలో లేని సంఘాలతో లాలూచీ పడి, కార్మికుల ఐక్యతను దెబ్బతీయాలని రేవంత్ రెడ్డి సర్కారు కుట్రలు చేస్తోంది. గతంలో కూడా ఇలాగే కార్మికులను మోసం చేశారు. పీఆర్సీ, ఏరియర్స్ అడిగితే కుట్రలు చేస్తారా? మీ అసమర్థతకు ఆర్టీసీ కార్మికుల కుటుంబాలను బలి చేస్తారా? అని ప్రశ్నించారు.రాష్ట్రమంతా సమ్మెల బాట పట్టినా, ఉద్యోగులు ఆందోళనలో ఉన్నా సీఎం రేవంత్ రెడ్డికి మాత్రం చీమకుట్టినట్లు కూడా లేదు. ఆయనకు కేవలం తన 'వ్యక్తిగత ఇమేజ్' బిల్డింగ్ మీద ఉన్న ధ్యాస ప్రజల సమస్యల మీద లేదు. జాతీయ నాయకుడిగా ఎదగాలనే ఆరాటంతో, దేశాన్ని విడగొట్టేలా 'నార్త్ వర్సెస్ సౌత్' అంటూ విషం చిమ్ముతున్నారు.ప్రధాని నరేంద్ర మోదీ గారు మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పిస్తూ చారిత్రాత్మక చట్టం తీసుకొస్తుంటే.. దాన్ని అడ్డుకోవడానికి రేవంత్ రెడ్డి ప్రపంచంలో ఎక్కడా లేని వితండవాదాన్ని తెరపైకి తెస్తున్నారు. డీలిమిటేషన్ పేరుతో ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తూ, మహిళల హక్కులకు గండికొట్టాలని చూడటం దుర్మార్గం. ఒకవైపు తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే.. ముఖ్యమంత్రి మాత్రం ఢిల్లీ పర్యటనలు, రాజకీయ వక్రీకరణలు, ప్రాంతీయ విద్వేషాలు రచ్చగొట్టడంలో మునిగిపోయారు.కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే సచివాలయ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని, ఆర్టీసీ కార్మికుల సమ్మెకు కారణమైన సమస్యలను పరిష్కరించాలనిబిజెపి ఎన్.రాంచందర్ రావు బిజెపి డిమాండ్ చేసారు.

# నగరనిజం

# జిల్లా అనుబంధం

## అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

**మృతుడు ఆర్బి నగర్ వాసి సభావత్ శంకర్ గా గుర్తించిన పోలీసులు**

**పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన శంకర్**

**నీమ్స్ హాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన శంకర్**

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న శంషాబాద్ పోలీసులు**





రాజేంద్రనగర్, ఏప్రిల్ 17(నగరనిజం ప్రతినిధి):అప్పుల బాధ భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తీవ్ర విషాదాన్ని నింపిన ఈ ఘటన గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ శంషాబాద్ పరిధిలోని ఆర్బీ నగర్ లో శుక్రవారం నాడు చోటుచేసుకుంది. శంషాబాద్ రూరల్ ఇన్స్పెక్టర్ నరేందర్ రెడ్డి కథనం ప్రకారం ఆత్మహత్య ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శంషాబాద్ పరిధిలోని ఆర్బీ నగర్ కాలనీకి చెందిన సభావత్ శంకర్ (38) తెలిసిన చోటల్లా అప్పులు చేశాడు. చేసిన అప్పులు తీర్చలేక అప్పుల బాధతో ఏప్రిల్ 6వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు గొల్లపల్లి రోడ్డులో పురుగుల (గడ్డి) మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ మేరకు అపస్మారక స్థితికి చేరుకున్న శంకర్ ను శంషాబాద్ లోని లిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అయితే శంకర్ ఆరోగ్య పరిస్థితి విషమించడం వైద్యుల సలహా మేరకు అదే రోజు అతని కుటుంబ సభ్యులు హైదరాబాద్ లోని నీమ్స్ ఆసుపత్రికి తరలించారు. అయితే నీమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం నాడు మృతి చెందినట్లు శంషాబాద్ ఇన్స్పెక్టర్ నరేందర్ రెడ్డి ప్రకటించారు. అప్పుల బాధ భరించలేకనే సభావత్ శంకర్ ఆత్మహత్యకు పాల్పడినట్లుగా కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నప్పుడు సీఐ నరేందర్ రెడ్డి తెలిపారు.

## గజ్వేల్ పట్టణ, మండలం మేస్త్రి సంఘం యూనియన్ ఉపాధ్యక్షులుగా షీర్ల కనకయ్య యాదవ్‌కు సన్మానం



గజ్వేల్ ప్రజ్ఞాపూర్, ఏప్రిల్ ,17,(నగర నిజం): మున్సిపల్ పరిధిలోని 13 వార్డు ముట్రాజ్ పల్లి నుండి గజ్వేల్ పట్టణ, మండలం మేస్త్రి యూనియన్ ఉపాధ్యక్షులుగా నూతనంగ ఎన్నుకోబడిన సందర్భంగా శ్రీ క్రిష్ణ యాదవ యువ యువసేన ఆధ్వర్యంలో షీర్ల కనకయ్య యాదవ్ కి శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువాతో సన్మానించడం జరిగింది.ఈకార్యక్రమంలో బిజెపి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్, నాయకులు రాగిరి స్వామి, బాలకనకయ్య, అర్కే యాదవ్, దేవులపల్లి యాదగిరి, కనకయ్య, చీర్ల బాబు, దాసరి కర్ణకర్, రమేశ్ , దేవులపల్లి రాజు, రాగిరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఐటీ మంత్రి శ్రీధర్ బాబుని కలిసిన అనిల్ రెడ్డి



వర్గల్ మండలం, ఏప్రిల్, 17,(నగర నిజం): శామీర్ పేట లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హన్మంతరావు ,రాష్ట్ర మాజీ సర్పంచుల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ చిటుకుల మహిపాల్ రెడ్డితో కలిసి ఐటీ మంత్రి శ్రీధర్ బాబుని మర్యాదపూర్వకంగా కలిసిన సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి.ఈ కార్యక్రమంలో వారితో పాటు మల్లారెడ్డిపల్లి కాంగ్రెస్ పార్టీ వార్డు మెంబర్స్ కరుణాకర్ రెడ్డి,నాగరాజు,అబ్జాల్ అమీనా,పిట్ల కృష్ణ తదితరులున్నారు.

# డాక్టరేట్ సాధించిన ఐనాపూర్ గ్రామ యువకుడు కర్రోళ్ల బిక్షపతి



కొమురవెల్లి మండలం, ఏప్రిల్, 17,(నగర నిజం): ఐనాపూర్ గ్రామానికి చెందిన కర్రోళ్ల బిక్షపతి డాక్టరేట్ పట్టా సాధించిన సందర్భంగా గ్రామస్తులు యూత్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టరేట్ కర్రోళ్ల బిక్షపతి మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీ వృక్షశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్ పి. కమలాకర్ ఆధ్వర్యంలో స్టడీస్, పాలిటో కెమికల్, ఫ్లోరింగ్, ఆంటీ మైక్రోబయాల్, విట్రో, వివో అప్రోచ్,అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు.వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ తనను చదివించిన తల్లితండ్రులు కర్రోళ్ల యాదయ్య, కనకమ్మ కష్టసాధన, కుటుంబ సభ్యుల త్యాగం తన విజయానికి పునాది అని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో అసిస్టెంట్ ప్రొఫెసర్గా సేవ చేయడం తన లక్ష్యమని తెలిపారు.బిక్షపతి తన విద్యను జడ్పీహెచ్ఎస్ ఐనాపూర్లో పదవ తరగతి వరకు, మహర్షి జూనియర్ కళాశాల చేర్యాలలో ఇంటర్మీడియట్, ప్రభుత్వ డిగ్రీకళాశాల సిద్ధిపేటలో డిగ్రీ, సీకేఎం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో పీజీ, సేయింట్ పీటర్స్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, కాకతీయ యూనివర్సిటీ హన్మకొండ నుండి బి.ఎడ్ పూర్తి చేశారు. తెలుగు మీడియం నుండి వచ్చిన తనకి పీజీ చదువులో డా. ఇంద్రసేనారెడ్డి, డా. జానకి రామయ్య మార్గదర్శకత్వంలో యూనివర్సిటీ ర్యాంక్ సాధించడం విశేషం. పీజీ తర్వాత కుటుంబ పరిస్థితుల కారణంగా ఒకవైపు ప్రైవేట్ కళాశాలలో జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్గా పని చేస్తూనే కుటుంబానికి తోడుగా నిలిచి, మరోవైపు పట్టుదలతో పీహెచ్డీ పూర్తి చేయడం ఆయన సంకల్పాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రస్తుతం మైనారిటీ గురుకుల కళాశాల, నర్సాపూర్లో బోటనీ జూనియర్ లెక్చరర్గా విధులు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా కర్రోళ్ల బిక్షపతి మాట్లాడుతూ, తన ప్రయాణంలో తోడ్పడిన ప్రొఫెసర్స్, ఉపాధ్యాయులు, యూనివర్సిటీ విద్యార్థి సంఘ నాయకులు, గ్రామ యువత, కుటుంబ సభ్యులు, మిత్రబృందం మరియు శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన విజయాన్ని గుర్తించి సన్మానం చేసిన కొమురవెల్లి ఎస్ఐ తోట మహేష్ కుమార్ గారు, ఐనాపూర్ గ్రామ సర్పంచ్ ఎరుపుల కళ్యాణి కృష్ణ గారు, ఉపసర్పంచ్ మల్లం శ్రీనివాస్, వార్డు సభ్యులు మరియు కొమురవెల్లి కానిస్టేబుల్ మేరుగు సతీష్, సాంస్కృతిక సారధి కవి గాయకులు పిన్నింటి రత్నం, అంబేద్కర్ సంఘాల నాయకులు యూత్ సభ్యులు పెయింటర్ అసోసియేషన్ అభినందనలు శుభాకాంక్షలు తెలియజేసారు


# అక్రమాలకు 'అధికార' అండ

.

**ఇంద్రేశంలో మున్సిపల్ మామూళ్ల పర్వం?**

**అక్రమ అంతస్తులకు 'రంగుల' ముసుగు..**

**అధికారుల కళ్లు గప్పుతున్న బిల్డర్ల మాయాజాలం!**









నగర నిజం సంగారెడ్డి జిల్లా ఇంద్రేశం/పటాన్ చెరు: అధికారుల కళ్లు మూసుకున్నాయా? లేక మామూళ్ల మత్తులో ఉన్నాయా? అన్న విమర్శలకు ఇంద్రేశం మున్సిపాలిటీ వేదికగా మారుతోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిబంధనలను నడిరోడ్డుపై ఖూనీ చేస్తుంటే, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

### రంగులు వేసి పక్కదారి.. బిల్డర్ల బరితెగింపు!

ఇంద్రేశంలో బిల్డర్ల అక్రమాలు పరాకాష్టకు చేరాయి. అధికారుల తనిఖీల నుంచి తప్పించుకోవడానికి అక్రమంగా నిర్మించిన పై అంతస్తులు పాతవిగా కనిపించేలా, పక్కా ప్లానింగ్తో హడావుడిగా రంగులు వేస్తూ అధికారుల కళ్లుగప్పుతున్నారు.పాత అనుమతులు ఉన్నాయని, ఇవి పాత నిర్మాణాలేనని నమ్మించేలా బయటకి రంగులతో ముస్తాబు చేసి విచారణను పక్కదారి పట్టిస్తున్నారు.ఇంత జరుగుతున్నా కనీసం నిర్మాణంలో ఉన్న మెటీరియల్ కానీ, కొత్తగా వేసిన పెయింటింగ్ను కానీ అధికారులు గుర్తించకపోవడం వెనుక పెద్ద 'హస్తం' ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### పంచాయతీ పర్మిషన్.. మున్సిపల్ బిల్డింగ్!

గ్రామ పంచాయతీ ఉన్న సమయంలో తీసుకున్న పాత అనుమతులను అడ్డం పెట్టుకుని బిల్డర్లు అక్రమ రాజ్యానికి తెరలేపారు.

అనుమతి ఒకలా.. నిర్మాణం మరోలా

కేవలం +o2 అనుమతి తీసుకొని, ఎంచక్కా +o5 అంతస్తులు నిర్మిస్తున్నారు. కేవలం కాగితాల మీద పాతవిగా చూపిస్తూ లోపల మాత్రం అత్యాధునిక నిర్మాణాలు సాగిస్తున్నారు.

### నోటీసులు 'షో'.. వసూళ్లు 'ఫిక్స్'!

నిబంధనలు ఉల్లంఘించిన భవనాలపై అధికారులు ఇచ్చే నోటీసులు కేవలం ప్రదర్శనకే పరిమితమవుతున్నాయి. ఫిర్యాదులు వచ్చినప్పుడు హడావుడిగా నోటీసులు జారీ చేయడం, ఆ తర్వాత బిల్డర్లు వేసే 'రంగుల' ముసుగులో నిజాలను తొక్కిపెట్టి లోపాయికారీ ఒప్పందాలు చేసుకోవడం ఇక్కడ నిత్యకృత్యంగా మారింది.

### ప్రజావాణికి విలువేది?

బాధితులు స్వయంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి ద్వారా ఫిర్యాదు చేసినా, క్షేత్రస్థాయి అధికారుల తీరులో మార్పు రావడం లేదు. సెట్ బ్యాక్ నిబంధనలు గాలికి ఎగిరిపోయాయి. భవిష్యతు లో ఏదైనా అగ్ని ప్రమాదం సంభవించినా, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తమైనా ఈ అక్రమ కట్టడాలకు వమ్ము చేసిన అధికారులే బాధ్యత వహిస్తారా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు నిద్రమత్తు వదిలి, రంగుల ముసుగులో సాగుతున్న అక్రమాలపై క్షేత్రస్థాయిలో విచారణ జరపాలి. అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్న అధికారులపై,అధికారులను తప్పుదోవ పట్టిస్తున్న బిల్డర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇంద్రేశం ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# మేడిపల్లిలో తీవ్ర ఉద్రిక్తత.. మంచిరెడ్డి సవాల్కు అడ్డుకట్ట

**అనుమతి లేదంటే పోలీసుల ఎంట్రీ.. నేతల అరెస్టు, దిగ్బంధం**

**సాగర్ రహదారిపై బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఆందోళన**

**పోలీసులతో అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం**

**ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి**









ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 17 (నగరనిజం ) : ఫ్యూచర్ సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని యాచారం మండలం మేడిపల్లిలో శుక్రవారం రాజకీయ ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకున్నాయి. ఫార్మాసిటీ భూసేకరణలో అవినీతి ఆరోపణల నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి విసిరిన సవాల్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ సవాల్ అమలు దశలో పోలీసులు జోక్యం చేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మంచిరెడ్డి కిషన్ రెడ్డి మేడిపల్లిలో రైతుల సమక్షంలో నిజానిజాలు తేల్చుకుందామని ప్రకటించగా, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున అక్కడికి తరలివెళ్లారు. అయితే ముందస్తుగా అనుమతి లేదని పేర్కొంటూ పోలీసులు అక్కడ ఏర్పాటు చేసిన టెంట్లను తొలగించారు. అంతేకాకుండా, వివిధ ప్రాంతాల్లోనే నాయకులను అడ్డుకుని మేడిపల్లికి వెళ్లకుండా నిరోధించారు. ఈ సందర్భంగా మేడిపల్లికి చేరుకున్న మంచిరెడ్డి కిషన్ రెడ్డి, ఆయన కుమారుడు యువనేత మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రశాంత్ రెడ్డిని మహేశ్వరం పోలీస్ స్టేషన్కు తరలించగా, కిషన్ రెడ్డిని ఇబ్రహీంపట్నంలోని పార్టీ కార్యాలయంలోనే నిర్బంధించారు. పోలీసులు, బిఆర్ఎస్ నేతల మధ్య తోపులాటలతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు నేతలను అరెస్టు చేసే క్రమంలో వారికి తీవ్ర గాయాలయ్యాయి. మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డికి ఎడమ భుజం తీవ్రగాయం అయింది. దీంతో ఆగ్రహానికి గురైన బీఆర్ఎస్ కార్యకర్తలు భారీగా సాగర్ రహదారిపైకి చేరుకుని ఆందోళనకు దిగారు. రహదారిపై బైఠాయించి ట్రాఫిక్కు అంతరాయం కలిగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేస్తూ తీవ్ర నినాదాలు చేశారు. పోలీసులు కార్యకర్తలను చెదరగొట్టేందుకు ప్రయత్నించగా, కొంతసేపు వాగ్వివాదాలు చోటుచేసుకున్నాయి. తరువాత పార్టీ కార్యాలయంలో కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన మంచిరెడ్డి కిషన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఫార్మాసిటీ భూసేకరణలో అవినీతి చేశానని ఆరోపిస్తున్నారని, ఒక్క రైతు దగ్గరైనా నేను వంద రూపాయలు తీసుకున్నట్టు, ఒక చాయ్ తాగినట్టు అయినా నిరూపించగలిగితే రాజకీయాలను వదిలేస్తానని అన్నారు. రైతుల ముందే నిజం తేల్చుకుందామని మేడిపల్లికి రమ్మన్నా, రావడానికి భయపడుతున్నారని అన్నారు. తప్పుడు ఆరోపణలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించడం ఆపాలని ప్రజల ముందు రావడానికి ధైర్యం లేకపోతే ఆరోపణలు చేయడం ఎందుకు? పోలీసులను ఉపయోగించి అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం అని విమర్శించారు. తమ మీద అబద్ధాలు, అరాచకాలు కొనసాగిస్తే ప్రజలతో కలిసి తిరగబడతామని, రైతుల హక్కుల కోసం చివరి వరకు పోరాడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, దండెం రామిరెడ్డి, కర్నాటి రమేష్ గౌడ్, డాక్టర్ రాజునాయక్, చీరాల రమేష్, ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి, కౌన్సిలర్లు త్రిలోక్, ప్రవీణ్ కుమార్, శంకర్, నాయకులు జేర్కొని రాజు, బద్రీనాథ్ గుప్తా, నిట్టు జగదీశ్వర్, శివసాయి, పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# శాశ్వతంగా అధికారంలో ఉండాలని బీజేపీ కుట్ర-ప్రొ కోదండ రాం



మేడిపల్లి :ఏప్రిల్ 17: (నగర నిజం )తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుపై బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ జన సమితి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.కోదండ రాం తెలిపారు. ఎంతో మంది ప్రాణ త్యాగం చేస్తే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందని గుర్తు చేశారు. తెలంగాణ ఆకాంక్షలను బీజేపీ సీనియర్ నేతలు సుష్మా స్వరాజ్, అరుణ్ జైట్లీ అర్థం చేసుకున్నారని చెప్పారు. తేజస్వీ సూర్యని బీజేపీ నేతలు వెనకేసుకు రావడం బాధాకరమని పేర్కొన్నారు. రాజ్యాంగ బద్ధంగానే తెలంగాణ ఏర్పాటైందని చెప్పారు. పదే పదే తెలంగాణను కించ పరచడం పద్ధతి కాదంటూ బీజేపీ నేతలకు ఈ సందర్భంగా ఆయన హితవు పలికారు.శుక్రవారం హైదరాబాద్లో తెలంగాణ జన సమితి పార్టీ కార్యాలయంలో ప్రొ. కోదండ రాం విలేకర్లతో మాట్లాడుతూ.. ఏ మాత్రం సందర్భం లేకుండా తెలంగాణ ఏర్పాటుపై తప్పుడు ఆరోపణలు చేశారంటూ తేజస్వీ సూర్యపై మండిపడ్డారు. రాజ్యాంగంలోని ఆర్టికల్-3 ప్రకారం రాష్ట్రాల కూర్పు జరుగుతుందని వివరించారు. ఏ మాత్రం అవగాహన లేకుండా బ్రిటిష్ కాలం నాటి పరిస్థితులకు తెలంగాణ ఏర్పాటుకు ముడి పెడుతూ తేజస్వీ సూర్య విమర్శలు చేశారని విమర్శించారు. బీజేపీ ఎంపీ మాట్లాడుతుంటే.. కేంద్ర మంత్రులు కూడా ఆయన్ని నిలువరించక పోవడం బాధాకరమన్నారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్రానికి సంబంధించిన బిల్లుకు బీజేపీ నేతలు సుష్మా స్వరాజ్, వెంకయ్య నాయుడు మద్దతు ఇచ్చారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఆ విషయం అర్థం చేసుకోకుండా.. తేజస్వీ సూర్య మాట్లాడటం బాధాకరమన్నారు. తెలంగాణను విమర్శించే విధంగా తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర బీజేపీ ఎంపీలు ఖండించక పోవడం శోచనీయమని పేర్కొన్నారు. తేజస్వీ సూర్య వ్యాఖ్యలు పార్లమెంట్ రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అతడిపై చర్యలు తీసుకోవాలని బీజేపీలోని సీనియర్లకు స్పష్టం చేశారు.డీలిమిటేషన్ బిల్లు ఆమోదం పొందితే.. రాష్ట్రాలకు సంబంధించిన సీట్లను జనాభా ప్రాతిపదికన కేటాయిస్తారని ప్రొ. కోదండ రాం తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారమా?.. 2026 జనాభా లెక్కల ప్రకారమా? ఈ డీలిమిటేషన్ చేస్తుంది అనేది ప్రశ్నార్థకంగా మారిందన్నారు. 2026 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ చేయాలని కేంద్రాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఉత్తరాది, దక్షిణాది మధ్య అసమతుల్యత, తారతమ్యాలు ఈ డీలిమిటేషన్ చూపిస్తుందన్నారు. అన్ని రాష్ట్రాలకు అర్థవంతమైన భాగస్వామ్యం ఉండాలని.. లేకంటే గొడ్డలి పోట్టు లాంటిదని ఆయన అభిప్రాయపడ్డారు.దేశ ప్రయోజనాలను మర్చిపోయి డీలిమిటేషన్ బిల్లు తీసుకురావడం బాధాకరమన్నారు. డీలిమిటేషన్, సీట్ల ప్రక్రియను తక్షణమే నిలిపి వేయాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీట్ల పెంచుకుని శాశ్వతంగా అధికారంలో ఉండాలని బీజేపీ కుట్ర చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ బలంగా ఉన్న రాష్ట్రాల్లో సీట్లు పెంచుకుని.. ఆధిపత్యాన్ని పెంచుకోవాలని చూస్తోందని ఆ పార్టీ నేతల తీరును ఎండగట్టారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన బీసీ రిజర్వేషన్స్ బిల్లును కేంద్రం తొక్కి పెట్టిందని గుర్తు చేశారు.మే12వ తేదీన తెలంగాణ జన సమితి ప్లీనరీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ ప్లీనరీ వేదికగా తమ భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ జన సమితి 4వ ప్లీనరీ పోస్టర్స్ను ప్రొ. కోదండ రాం ఆవిష్కరించారు.

నగరనిజం

18 శనివారం,ఏప్రిల్,2026

# నాయకత్వానికి నినాదం కాదు... గీతం!
## మహేష్ కుమార్ గౌడ్‌పై ప్రత్యేక సాంగ్ ఆవిష్కరణ





కుతుబుల్లాపూర్, ఏప్రిల్ 17 (నగరనిజం ప్రతినిధి ):హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వాన్ని ప్రతిబింబిస్తూ రూపొందించిన ప్రత్యేక గీతాన్ని గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని రాయదుర్గంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడగా, కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.శ్రీ కృష్ణ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు, డీసీసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ గౌడ్, రాష్ట్ర యువ నాయకుడు శశాంక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. గీతాన్ని టీపీసీసీ అధ్యక్షుడు మరియు ఎంఎల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ స్వయంగా ఆవిష్కరించగా, మాజీ ఎంఎల్సీ ప్రభాకర్ రావు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వి జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ, మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వం ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందిస్తూ సేవాభావంతో ముందుకు సాగే ఆదర్శ రాజకీయ నాయకత్వంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేసే తత్వం ఆయన ప్రత్యేకత అని అన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, ప్రతి కార్యకర్తను ప్రోత్సహించే నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని తెలిపారు.అలాగే సాధారణ జీవన విధానం, వినమ్రత, అందరితో కలిసిమెలిసి ఉండే స్వభావం మహేష్ గౌడ్‌ను ప్రత్యేకంగా నిలబెడుతున్నాయని అన్నారు. తెలంగాణ అభివృద్ధి, యువతకు అవకాశాల సృష్టి, సామాజిక న్యాయం సాధనలో ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని వివరించారు. యువతకు ప్రేరణగా నిలుస్తూ, సేవా భావంతో రాజకీయాల్లో ముందుకు రావాలని ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఆవిష్కరించిన గీతం మహేష్ కుమార్ గౌడ్ ప్రజాసేవా దృక్పథం, నాయకత్వ లక్షణాలు, పార్టీ పట్ల అంకితభావాన్ని ప్రతిబింబిస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ గీతం ద్వారా యువతలో కొత్త ఉత్సాహం నింపడమే లక్ష్యమని చెప్పారు.

ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం మొత్తం ఉత్సాహభరితంగా సాగింది.




# నేల ఆరోగ్య నిర్వహణపై అవగాహన కార్యక్రమం





రంగారెడ్డి జిల్లా, ఏప్రిల్ 17, 2026 (నగర నిజం) : యాచారం మండలం నల్లవెల్లి గ్రామంలో నేల ఆరోగ్య నిర్వహణ, సమతుల్య ఎరువుల వాడకంపై అవగాహన కార్యక్రమాన్ని ఐసీఏఆర్–సీఆర్ఐడీఏ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు సుస్థిర వ్యవసాయ పద్ధతులపై విస్తృతంగా అవగాహన కల్పించారు.వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ బి. భార్గవి పాల్గొన్న వారిని ఉద్దేశించి మాట్లాడుతూ, సుస్థిర పోషక నిర్వహణ పద్ధతులను అనుసరించడం ద్వారా నేల ఉరుకుదల పెరగడంతో పాటు పంటల దిగుబడులు మెరుగుపడతాయని తెలిపారు. నేల శాస్త్ర ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ, నేల పరీక్ష ఆధారంగా సమతుల్య ఎరువులను వాడటం అత్యవసరమని పేర్కొన్నారు. యూరియా అధిక వాడకం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు పంటల ఉత్పాదకత తగ్గే ప్రమాదం ఉందని రైతులను హెచ్చరించారు.సీనియర్ నేల శాస్త్రవేత్త డాక్టర్ ప్రియా గురవ్ జీవ ఎరువుల ప్రాముఖ్యతను వివరించారు. రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి జీవ ఎరువులు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. జీవ ఎరువులతో విత్తన శుద్ధి విధానాన్ని ప్రత్యక్షంగా చూపిస్తూ రైతులకు శిక్షణ ఇచ్చారు.సుస్థిర వ్యవసాయం కోసం సమీకృత పోషక నిర్వహణలో భాగంగా సేంద్రియ, పచ్చిరొట్ట ఎరువులను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా నేల నమూనా సేకరణకు సంబంధించిన సరైన విధానాన్ని రైతులకు వివరించారు. క్షేత్ర స్థాయిలో మెరుగైన పోషక నిర్వహణకు దోహదపడే విధంగా సమాచార పుస్తకాలను పంపిణీ చేశారు.



# గజ్వేల్ మహతి ఆడిటోరియంలో ఘనంగా 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత అవగాహన సదస్సు








గజ్వేల్ ప్రజ్ఞాపూర్, ఏప్రిల్,17,(నగర నిజం): రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా గజ్వేల్‌లోని మహతి ఆడిటోరియంలో నిర్వహించిన 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత అవగాహన సదస్సు విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, ఐపిఎస్ హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ హైమావతి, పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని వాహనదారులకు దిశానిర్దేశం చేశారు.

### డీజీపీ ముఖ్య సందేశం:

సదస్సులో డీజీపీ శివధర్ రెడ్డి, ఐపిఎస్ మాట్లాడుతూ, రోడ్డు భద్రతపై వాహనదారులు పాటించాల్సిన కీలక సూత్రాలను వివరించారు: "మనం ఆలోచించే లోపే ప్రమాదం జరిగిపోతుంది. ఆ సమయంలో మనకు రియాక్షన్ టైమ్ కూడా ఉండదు, అందుకే అప్రమత్తత చాలా ముఖ్యం." హైవేలపై ప్రయాణించేటప్పుడు ఎల్లప్పుడూ ఎడమ వైపు మాత్రమే వెళ్లాలి. కేవలం ఇతర వాహనాలను ఓవర్‌టేక్ చేసే సమయంలో మాత్రమే కుడి వైపు ట్రాక్‌ను ఉపయోగించాలి. ఓవర్‌టేక్ చేసిన వెంటనే మళ్ళీ ఎడమ వైపునకు వచ్చేయాలి. ప్రస్తుత పర్యటనల్లో కేవలం 10 శాతం మంది మాత్రమే ఈ నిబంధన పాటిస్తున్నారని ఆయన విచారం వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో ఎదురుగా వాహనం వచ్చినప్పుడు తప్పకుండా లో–బీమ్ కు మారాలి. వాహనం దాటే వరకు లో–బీమ్‌లోనే ఉండాలి. అలాగే గ్రామాల గుండా ప్రయాణించేటప్పుడు కూడా లో–బీమ్ ఉపయోగించడం వల్ల ప్రజలకు ఇబ్బంది ఉండదు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, ముఖ్యంగా దాని స్ట్రాప్‌ను గట్టిగా పెట్టుకోవాలి. అలాగే కారులో ప్రయాణించే వారందరూ (ముందు, వెనుక సీట్లలో) తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలి. గ్రామీణ రోడ్ల నుండి హైవేపైకి వచ్చేటప్పుడు ఒక్క నిమిషం ఆగి, హైవేపై వెళ్లే వాహనాలకు దారి ఇచ్చిన తర్వాతే లోపలికి రావాలి. పరిసరాలను గమనిస్తూ, రోడ్డు మీద పూర్తి దృష్టి కేంద్రీకరించి వాహనం నడపాలని, పెద్ద వాహనాలకు వెనుక భాగంలో రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు తప్పనిసరిగా ఉండాలని ఆయన సూచించారు.

### పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ సందేశం:

కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఐపిఎస్ మాట్లాడుతూ వాహనదారులకు భావోద్వేగపూరితమైన పిలుపునిచ్చారు:
"'అరైవ్ అలైవ్' అంటే కేవలం ఒక ప్రచారం కాదు.. సురక్షితంగా ఇంటికి తిరిగి వస్తానని మీరు మీ కుటుంబ సభ్యులకు ఇచ్చే వాగ్దానం."
ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా తమ ప్రాణాలను మాత్రమే కాకుండా, తమ కోసం ఎదురుచూసే కుటుంబ సభ్యుల భవిష్యత్తును కూడా కాపాడుతారని పేర్కొన్నారు. వాహనదారులు అతివేగానికి వెళ్లకుండా నియంత్రించుకోవాలని, రోడ్డుపై ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటూ ఎదుటి వాహనాల కదలికలను ముందే అంచనా వేయాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం అనేది తనతో పాటు తోటి వాహనదారుల ప్రాణాలను కూడా ప్రమాదంలో పడేయడమేనని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు . హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ ధరించడం వల్ల ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంటుందని ఆమె వివరించారు.

### జిల్లా కలెక్టర్ హైమావతి ప్రసంగం:

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రోడ్డు భద్రత అనేది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా నేడు ఈ 'అరైవ్ అలైవ్' ప్రోగ్రామ్‌ను కూడా జోడించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఈ కార్యక్రమాన్ని వారం రోజుల పాటు నిర్వహిస్తున్నామని, రోజురోజుకు పెరుగుతున్న ప్రమాదాలను అరికట్టడమే దీని ప్రధాన ఉద్దేశమని వివరించారు. మోటార్ సైకిళ్లపై ముగ్గురు ప్రయాణించడం, పరిమితికి మించి లోడ్‌తో వాహనాలను నడపడం వంటి పనులు ప్రాణాంతకమని, వీటిని ఖచ్చితంగా మానుకోవాలని ఆమె సూచించారు. ప్రతి పౌరుడు రోడ్డు భద్రతా ప్రమాణాలు మరియు ట్రాఫిక్ నిబంధనల పట్ల కనీస అవగాహన కలిగి ఉండాలని కోరారు.

# జైశ్రీరామ్ సేవా సమితి అధ్యక్షులు ఠాగూర్ ఉపేంద్ర సింగ్ చౌహాన్ ఆధ్వర్యంలో అమావాస్య అన్నదాన కార్యక్రమం



కొత్తపేట; ఏప్రిల్, 17 (నగర నిజం) : జైశ్రీరామ్ సేవాసమితి అధ్యక్షులు ఠాగూర్ ఉపేంద్ర సింగ్ చౌహాన్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని మోహన్ నగర్ లో శుక్రవారం నాడు అమావాస్య అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.... అన్నదానం మహాదానం అని ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని అభినందించారు సమాజంలో సేవ భావం పెంపొందించేందుకు ఈ తరహా కార్యక్రమాలు ఎంతో అవసరం అని తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ఠాగూర్ ఉపేందర్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ,గత మూడు సంవత్సరాల నుండి ఇక్కడ అన్నదానం నిర్వహిస్తున్నామని అన్నారు. అమావాస్య రోజు అన్నదానం చేస్తే ఎంతో మంచిదని పుణ్యమని ఈ విధంగా పెద్దల మాటలు ఆచరించి ప్రతి అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. దాదాపుగా ఈ అన్నదాన కార్యక్రమంలో సుమారు 600 మందికి పైగా పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొడ్డుపల్లి భరత్, సంగ్రామ్, సాయి, శేఖర్, రింకు గౌర్, వీరేష్, సురేందర్ ప్రసాద్, తనుష్ సింగ్, చైతన్య బాయ్, భవాని, యాదమ్మ, బిజెపి నాయకులు స్థానిక కాలనీ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ు

# సమస్యల పరిష్కారం కోసం గజ్వేల్ జిల్లా ఆసుపత్రిలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (1725) ధర్నా





గజ్వేల్ ప్రజ్ఞాపూర్, ఏప్రిల్, 17,(నగరనిజం): తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ 1725 (ఏఐటీయూసీ) అనుబంధ సంస్థ) కేంద్ర కమిటీ పిలుపు మేరకు, వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం రోజు గజ్వేల్ జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఒక రోజు ధర్నా నిర్వహించడం జరిగింది. రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, ఉదయం హాజరు సమయంలో ఈ నిరసన ప్రదర్శనను విజయవంతంగా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ గజ్వేల్ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస చారి మాట్లాడుతూ, గతంలో అనేకసార్లు విన్నవించినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతోనే ఈ దశలవారీ ఆందోళనకు దిగాల్సి వచ్చిందని తెలిపారు. రెండవ వేతన సవరణ సంఘం నివేదికను తక్షణమే ప్రవేశపెట్టి అమలు చేయాలి. ఐదు విడతల కరువు భత్యాన్ని వెంటనే మంజూరు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఉద్యోగులకు రావలసిన అన్ని రకాల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలి. టైం స్కేల్, కాంట్రాక్ట్ మరియు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలి. అక్రమ బదిలీలను నిలిపివేసి, 317 జీవో బాధితులకు కొత్త జీవో ద్వారా న్యాయం చేయాలి. కొత్త రిక్రూట్‌మెంట్ ద్వారా ఖాళీలను భర్తీ చేసి సిబ్బందిపై ఉన్న పనిభారాన్ని తగ్గించాలి. అర్హులైన వారికి ప్రమోషన్లు కల్పించాలి మరియు ఉద్యోగులందరికీ ఈ.ఎస్.ఐ (ఈ ఎస్ ఐ) వర్తించేలా 126 జీవోను సవరించాలి. డైరెక్టర్ ఆఫ్ హెల్త్, వైద్య విధాన పరిషత్ పరిధిలోని సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ డివిజన్ అధ్యక్షులు డి. శ్రీనివాసచారి, చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ విమల, నర్సింగ్ సూపరింటెండెంట్ ఎఫ్సిబా, సువర్ణ, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్స్ జగదాంబ, వకులాదేవి, నిర్మల, ఉమామహేశ్వరి, ఫార్మసీ ఆఫీసర్స్ మోహన్ బండారి, స్వర్ణలత, శిరీష, రమాదేవి, హెడ్ నర్సెస్ విమల దేవి, నిర్మల, శానిటరీ ఇన్స్పెక్టర్ లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్, ఈ.సీ.జీ టెక్నీషియన్ రాజు, ఆరోగ్యశ్రీ ఇన్చార్జి సురేందర్, సంతోష్, కనకయ్య మరియు పెద్ద సంఖ్యలో పారామెడికల్, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇష్టానుసారంగా డీలిమిటేషన్ చేస్తూ నాలుగో సారి అధికారంలోకి రావడానికి యత్నిస్తున్నబీజేపీ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



హైద్రాబాద్ ఏప్రిల్ 17 (నగర నిజం న్యూస్):బీజేపీ చేస్తున్న హిస్సా చోరీకి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ పార్లమెంట్లో పోరాడుతున్నారు

ప్రజలంతా ఈ విషయంలో అప్రమత్తమై ఆయనకు మద్దతుగా నిలవాలనిసంగారెడ్డిలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పిలుపు నిచ్చారుఇష్టానుసారంగా డీలిమిటేషన్ చేస్తూ నాలుగో సారి అధికారంలోకి రావడానికి బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందిమహిళా బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదు. ఇందులో లోపాలు ఉన్నాయి, సరిదిద్దాలని రాహుల్ గాంధీ పార్లమెంట్ లో పోరాడుతున్నారుదేశప్రజల స్వేచ్ఛా, స్వాతంత్రాలను అంచెలంచెలుగా లాగేసుకునే ప్రయత్నం బిజెపి చేస్తోంది. దీనికి వ్యతిరేకంగా రాహుల్ గాంధీపోరాడుతున్నారు

డీలిమిటేషన్ బిల్లులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసేలా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలోని ఐబీ నుంచి ర్యాలీఅనంతరం డీలిమిటేషన్ బిల్లు ప్రతులను జగ్గారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు దగ్ధం చేసారు.

## వనపర్తిలో ఇంటర్మీడియట్ ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన "వాగ్దేవి" విద్యార్థులు




**విద్యార్థులను ఘనంగా సన్మానించి అభినందించిన**
**వాగ్దేవి కళాశాల చైర్ పర్సన్ జి, పద్మారాణి ,**
**కరస్పాండెంట్ డి, స్వప్న**
**ప్రిన్సిపాల్ విజయ్ కుమార్**

వనపర్తి, జిల్లా నగర నిజం ఏప్రిల్(ప్రతినిధి ఎర్రమన్ను బాలరాజు) 17శుక్రవారం, నాడు ఐ పి ఈ మార్చ్ 2026 ఫలితాలలో వాగ్దేవి విద్యార్థుల ప్రభంజనం ఆదివారం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి 3వ ర్యాంక్ (జిల్లా స్థాయిలో 1స్ ర్యాంక్ )మార్కులను సాధించిన వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు గొప్ప విజయం సృష్టించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశం లో వాగ్దేవి ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ మాట్లాడుతూ 2026 ఇంటర్ ప్రథమ,ద్వితీయ సం॥ ఫలితాలలో అఖండ విజయం సాధించారు.ఎంపీసీ మరియు బైపీసీలో గ్రూపులలో రాష్ట్ర స్థాయి ర్యాంక్స్ తో విజయ సాధించారు అని పేర్కొన్నారు.విద్యార్థుల మార్కుల వివరాలు, మొదటి సంవత్సరం, ఎంపీసీ, పలపు ఇందు -466( మద్రికల్ ),బి. మోహన్- 464 (పుట్టాన్ దొడ్డి), బి. రవి-463(మాన్దొడ్డి), బై. పి.సి- ఈ మహేశ్వరి-427 ( కంచిరావు పల్లి ),బి.నందకిషోర్ -425, (పట్టాన్ దొడ్డి ), సి.ఇ.సి. లో కే.మల్లేశ్వరి-457 ( మన్నెవారి పల్లి ),సి-శివకుమార్ గౌడ్-450(జులకల్), సెకండ్ ఇయర్ లో మార్కులు ఎంపీసీ, వై.నవీన్ -994( పుట్టాన్ దొడ్డి ),కే.వెంకటేష్-994(దరూరు),వి,.వాణి -993 ( శాంతి నగర్ ), బి. శివకుమార్, 990( యెలకూరు )బి. పి.సి లో డి. నర్మదా- 988, ( శేరు పల్లి ) పెబ్బేర్) సి. ఇ.సి లో కే.శివలీల-976 ( బొమ్మణపల్లి ) ఎం. ఇ.సి లో ఏ.అరవింద్ గౌడ్-966 ( ఆల్వాలపాడు ) సి, ఇ, సి, బి అశ్విని -965, ( బొమ్మలపల్లి ) అనూష-964,( బొమ్మనోనపల్లి ) గత 5 సంవత్సరాలుగా రాష్ట్ర స్థాయిలో అత్యుతమ మార్కులు సాధించినదని వాగ్దేవి కళాశాల చైర్ పర్సన్ జి.పద్మారాణి , కారస్పాండెంట్ డి. స్వప్న, ప్రిన్సిపాల్- ఏ విజయ్ కుమార్, లెక్చరర్, భానుప్రకాష్ గౌడ్, శివ శంకర్, శివ, శేఖర్ గౌడ్, రమేష్ గౌడ్, అశోక్ సాగర్, రమేష్ నాయక్, రామాంజనేయులు, వల్లి,రాములు, చంద్రశేఖర్ తదితర లెక్చర్ బృందం పాల్గొన్నారు.







## వాసవి సేవాసమితి ఆధ్వర్యంలో అమావాస్య అన్నదానం

**ఆర్యవైశ్యుల సేవలు అభినందనీయం**
**టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి**



గజ్వేల్ ప్రజ్ఞాపూర్, ఏప్రిల్ , 17,(నగర నిజం): గజ్వేల్ పట్టణంలోని ఇందిరాపార్క్ చౌరస్తా వద్ద అమావాస్య అన్నప్రసాద వాసవి సేవాసమితి ఆధ్వర్యంలో కీర్తిశేషులు గౌరిశెట్టి మల్లయ్య విజయలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం, గౌరిశెట్టి మంజూష శ్రీనివాస్ దంపతులు వారి కుటుంబ సభ్యుల సౌజన్యంతో అమావాస్య అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్ మాట్లాడుతూ అన్నదానం మహాదానమని అమావాస్య రోజున అన్నదానం చేస్తే పితృ దేవతలకు మోక్షం కలుగుతుందని, అన్నారు. అలాగే ప్రతి నిత్యం వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ పలువురికి ఆదర్శంగా ఆర్యవైశ్యులు నిలుస్తున్నారని అన్నారు. అనంతరం కొమరవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ,సీనియర్ నాయకులు మెట్ రాములు మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రతి అమావాస్య రోజున దాతల సహకారంతో అమావాస్య అన్నదానం నిర్వహించడం జరుగుతుందని ఇందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్ధి బిక్షపతి, కైలాస ప్రభాకర్, తోట బిక్షపతి, గంగిశెట్టి వెంకటేశం, ఉమేష్, సిద్ధి రామచంద్రం,కైలాస ప్రశాంత్,రుక్మయ్య,శ్రీహరి, అమర్నాథ్, దుబకుంట లక్ష్మణ్, బుద్ద శంకరయ్య,గౌరిశెట్టి శ్రీనివాస్ మంజూష దంపతులు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వేములకొండ శివాలయ ఉత్సవాలకు ఈడీ వెంకన్నకు ఆహ్వానం

**బస్సు భవన్‌లో వేములకొండ ప్రతినిధుల వినతి --**
**గ్రామానికి బస్సు సేవ కోరింపు**
**సర్పంచ్ ఏర్పుల వెంకటేశం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ప్రత్యేక సమావేశం**
**శివాలయ పండుగకు ప్రముఖులను ఆహ్వానించిన గ్రామ నాయకులు**
**.వేములకొండకు బస్సు ప్రారంభంపై అధికారులను కోరిన గ్రామ పెద్దలు**



వలిగొండ ఏప్రిల్ 17( నగర నిజం)యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వేములకొండ గ్రామ అభివృద్ధి, ధార్మిక కార్యక్రమాల పట్ల గ్రామ నాయకులు చురుకుగా ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో, ఈరోజు హైదరాబాద్‌లోని బస్సు భవన్‌లో ఈడీ సీహెచ్. వెంకన్న సార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, వేములకొండ గ్రామంలో జరగనున్న శివాలయ పండుగకు అతిథిగా హాజరు కావాలని ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.అదే సమయంలో, వేములకొండ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని వినతి పత్రాన్ని కూడా సమర్పించారు. గ్రామ ప్రజలకు రవాణా సౌకర్యం అవసరమని ఈ సందర్భంగా వారు వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏర్పుల వెంకటేశం, జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా కమిటీ ఉపాధ్యక్షురాలు కేశిరెడ్డి నీరజ వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ కోఆప్షన్ మెంబర్ ఎస్కే రసూల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులిపలుపుల రాములు, స్వేరో నెట్‌వర్క్ జిల్లా అధ్యక్షులు ఎర్రవెల్లి నరసరావు పాల్గొన్నారు.

## బ్యాంక్ గ్యారెంటీ అగ్రిమెంట్ చేయని రైస్‌మిల్లుకు ధాన్యం కేటాయించే ప్రసక్తి లేదు

**రైస్ మిల్లర్ల యజమానులతో సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



వనపర్తి జిల్లా: నగర నిజం ఏప్రిల్ 17:రైస్ మిల్లులకు ధాన్యం కేటాయించాలంటే బ్యాంక్ గ్యారంటీ తో పాటు అగ్రిమెంట్ చేసుకోవాల్సిందే బ్యాంక్ గ్యారంటీ, అగ్రిమెంట్ చేయని రైస్ మిల్లుకు ధాన్యం కేటాయించే ప్రసక్తే లేదుకేటాయించిన మిల్లులోనే ధాన్యం దించుకోవాలి వేరే చోట దించితే చర్యలు ఉంటాయి - జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి రైస్ మిల్లులకు ధాన్యం కేటాయించాలంటే 10 శాతం బ్యాంకు గ్యారంటీ తో పాటు అగ్రిమెంట్ చేసుకోవాల్సిందే అని జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి మిల్లర్లకు సూచించారు.శుక్రవారం నాడు సాయంత్రం ఐ డి ఓ సి లోని సమావేశ మందిరంలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని రైస్ మిల్లర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా కోట్లాది రూపాయల వరి ధాన్యం మిల్లులకు అడ్వాన్సుగా ఇస్తుందని అలాంటప్పుడు మిల్లర్లు కేటాయించే ధాన్యంలో 10 శాతం బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలని అదే విధంగా అగ్రిమెంట్ చేసుకోవాలని సూచించారు. బ్యాంకు గ్యారంటీ ఇవ్వని మిల్లులకు ధాన్యం కేటాయించబడదని స్పష్టం చేశారు. రబీ సీజన్ లో ఇప్పటికే వరి కోతలు ప్రారంభమయ్యాయని, త్వరలో కొనుగోలు ప్రారంభించి బ్యాంక్ గ్యారంటీ ఇచ్చిన మిల్లులకు ధాన్యం కేటాయించడం జరుగుతుందని తెలియజేశారు. ఇప్పటి వరకు కొంత వరకు బ్యాంకు గ్యారంటీ ఇచ్చారని అయితే ఇచ్చిన గ్యారంటికి తగ్గ వడ్లు మాత్రమే కేటాయించడం జరుగుతుందన్నారు. గతంలో డిఫాల్ట్ అయిన మిల్లులు త్వరగా క్లియర్ చేసుకొని ధాన్యం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం మరికొంత గడువు ఇచ్చిందని, గత సీజన్ కు సంబంధించి పెండింగ్ బియ్యం త్వరగా ఎఫ్.సి.ఐ కి అప్పగించాలని తెలియజేశారు.ఇప్పటి వరకు బ్యాంకు గ్యారంటీ ఇవ్వని రైస్ మిల్లులు త్వరగా బ్యాంకు గ్యారెంటీ, అగ్రిమెంట్ ఇచ్చి వడ్లు తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ టి. వినోద్ కుమార్, జిల్లా సివిల్ సప్లై అధికారి విశ్వనాథ్, డి.యం. సివిల్ సప్లై ఆంజనేయులు, మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, మిల్లర్లు పాల్గొన్నారు.



Edited & printed and owner,publisher Yela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed Y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor Yela purushotham.(H.O) : plot no:31,H-No 1-13,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.(PRGI) .PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE

# గోల్డెన్ అవర్ స్పందనతో ప్రాణాల రక్షణ సాధ్యం

**ప్రమాదం జరిగిన వెంటనే గోల్డెన్ అవర్‌లో సరైన సహాయం అందిస్తే మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చు**

**ప్రతి ఒక్కరూ ప్రథమ చికిత్స, అత్యవసర స్పందనపై కనీస అవగాహన కలిగి ఉండాలని సూచించారు**

**ముఖ్య అతిథులుగా హాజరైన ఐజిపి డా. గజరావు భూపాల్ ఐపీఎస్.,**

**జిల్లా కలెక్టర్: ఆదర్శ సురభి ఐఏఎస్**





వనపర్తి జిల్లా, నగర నిజం ఏప్రిల్ 17 కొత్తకోట, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా వనపర్తి జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు కొత్తకోట పట్టణంలోని ఎ టీ ఆర్ కన్వెన్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐజీపీ డా. గజరావు భూపాల్ ఐపీఎస్.,హాజరై, వనపర్తి జిల్లా కలెక్టర్ శ్రీ ఆదర్శ్ సురభి,వనపర్తి ఇంచార్జి ఎస్పీ శ్రీ డా. వినీత ఐపీఎస్., తో కలిసి కార్యక్రమాన్ని ప్రారంబించి మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు, అంబులెన్స్ డ్రైవర్లు, ఆటో, లారీ, డీసీఎం డ్రైవర్లు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, యువత, విద్యార్థులకు 1000 మందికి నిపుణులచే గోల్డెన్ అవర్ సమయంలో ఎలా స్పందించాలి, ప్రాథమిక చికిత్స ఎలా అందించాలి, బాధితులను ఎలా తరలించాలి వంటి అంశాలపై నిపుణులైన డాక్టర్లచే సమగ్ర శిక్షణ అందించారు.అనంతరం డ్రైవర్లకువాహన డ్రైవర్లకు సీపీఆర్ శిక్షణ మరియు కంటి పరీక్షల వైద్య శిబిరాన్ని నిర్వహించి, వారి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ, ప్రతిజ్ఞ చేయించారు ప్రమాదాల నివారణకు పాటించాల్సిన నియమాలను వివరించారు.ఈ సందర్భంగా ఐజీపీ డా, గజరావు భూపాల్ గారు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే స్పందించే తొలి గంటను 'గోల్డెన్ అవర్' అంటారు. ఈ సమయంలో సరైన చికిత్స అందితే ప్రాణాలను కాపాడటం సాధ్యం అవుతుంది. ప్రతి పౌరుడు ప్రాథమిక సహాయం, బాధితులను సురక్షితంగా తరలించే విధానంపై అవగాహన కలిగి ఉండాలి. ప్రజల సహకారం లేకుండా రోడ్డు భద్రత లక్ష్యాలు సాధ్యం కావు. ఈ శిక్షణలు ప్రాణాలను రక్షించే శక్తిని సమాజానికి అందిస్తాయి. దేశవ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో సుమారు 50 శాతం మృతి చెందిన వారు ద్విచక్ర వాహనదారులేనని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. హెల్మెట్ ధరించడం ప్రాణాలను కాపాడే అత్యంత సరళమైన కానీ కీలకమైన భద్రతా చర్య అని పేర్కొన్నారు. అలాగే, కారులో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీటు బెల్ట్ ధరించడం ద్వారా ప్రమాదాల తీవ్రతను గణనీయంగా తగ్గించుకోవచ్చని వివరించారు.
ఇటీవల జరిగిన ప్రమాదాల్లో అధికంగా 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతే ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన విచారం వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తు అయిన యువతను రక్షించుకోవడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. దీర్ఘదూర ప్రయాణాల కోసం ద్విచక్ర వాహనాల కంటే సురక్షితమైన ఇతర రవాణా మార్గాలను ఎంచుకోవాలని సూచించారుఈ సందర్భంగా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ..రోడ్డు భద్రత కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత. గోల్డెన్ అవర్ సమయంలో సమయానికి స్పందిస్తే ప్రమాదాల తీవ్రతను గణనీయంగా తగ్గించవచ్చు. ఈ తరహా శిక్షణా కార్యక్రమాలు గ్రామ స్థాయి వరకు విస్తరించి, అవగాహనను పెంపొందించడం అత్యంత అవసరం."ఈ సందర్భంగా ఇంచార్జి ఎస్పీ డా. వినీత్ ఐపీఎస్ గారు మాట్లాడుతూ.. డ్రైవర్లు, యువత, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేస్తే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చు. భద్రతా నియమాలు పాటించడం, అప్రమత్తంగా ఉండడం ద్వారా ప్రమాదాలను ముందుగానే నివారించవచ్చు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో బాధ్యతాయుతమైన డ్రైవింగ్ సంస్కృతి పెంపొందించడమే లక్ష్యమని ఈ గోల్డెన్ అవర్ స్పందన శిక్షణ కార్యక్రమం ప్రజల్లో బాధ్యతను పెంపొందిస్తూ, రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రాణాలను రక్షించే దిశగా ఒక కీలక ముందకు సాగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పి వెంకటేశ్వరరావు వనపర్తి డిసిఆర్బి డిఎస్పి, బాలాజీ నాయక్, వనపర్తి డీఎంహెచ్ఓ కొత్తకోట మున్సిపల్ చైర్మన్,పోతులపల్లి అరుణ, మున్సిపల్ వైస్ చైర్మన్,పల్లవి,మదనాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్, ప్రశాంత్, కొత్తకోట సీఐ, రాంబాబు, వనపర్తి సిఐ రత్నం ఆత్మకూరు, శివకుమార్, కొత్తకోట ఎస్సై, శివానందం, వనపర్తి జిల్లాలోని ఎస్సైలు, ప్రజా ప్రతినిధులు యువకులు, విద్యార్థులు, డ్రైవర్లు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఎండలపై అప్రమత్తంగా ఉండాలి
## కళ్లెం నవజీవన్ రెడ్డి సూచనలు



హయత్‌నగర్, ఏప్రిల్ 17 (నగర నిజం): రాష్ట్రంలో రోజురోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలు జాగ్రత్తలు పాటించాలని తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి సూచించారు. అవసరం లేకుండా ఎండలో బయటకు రావద్దని, ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లడం పూర్తిగా నివారించాలని ఆయన అన్నారు. తగినంత నీరు తాగడం, తేలికపాటి దుస్తులు ధరించడం, వీలైనంత వరకు చల్లని ప్రదేశాల్లోనే ఉండడం మంచిదని తెలిపారు. పిల్లలు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తూ, ఎండ తీవ్రత వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. అందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన కోరారు. "జాగ్రత్తగా ఉండండి -- ఆరోగ్యంగా ఉండండి" అని ఆయన సందేశం ఇచ్చారు.

## పెండింగ్ బకాయిల విడుదల కోరుతూ తూప్రాన్‌లో ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నిరసన



మెదక్ బ్యూరో : నగర నిజం :తూప్రాన్ మండల రెవెన్యూ ఐఓసి కార్యాలయం ముందు ప్రభుత్వ ఉద్యోగస్తుల టీజీఇజెఏసి ఆధ్వర్యంలో భాగస్వామ్య సంఘాలతో కలిసి భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ టెంట్ వేసుకొని ఆందోళన కొనసాగించారు. అనంతరం తూప్రాన్ రెవెన్యూ డివిజన్ అధికారి జయచంద్ర రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం నెలకు 700 కోట్ల మేర బిల్లులు విడుదల చేస్తున్నప్పటికీ, ప్రతి నెల సగటున 600 మంది ఉద్యోగులు రిటైర్ అవుతుండటంతో బకాయిలు భారీగా పేరుకుపోతున్నాయని తెలిపారు. మొత్తం పెండింగ్‌లో ఉన్న రూ.13,000 కోట్లను ఏకమొత్తంగా విడుదల చేసి పెన్షనర్ల కుటుంబాలకు ఉపశమనం కల్పించాలని కోరారు.ఉద్యోగులు, పెన్షనర్లకు ఆరోగ్య కార్డుల మంజూరు విషయంలో ప్రభుత్వం పలుమార్లు హామీ ఇచ్చినా అమలు జరగడం లేదని విమర్శించారు. కొత్తఈహెచ్ఎస్ (జుూ) స్కీమ్ విధివిధానాలను రూపొందించి మే 1 నుండి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీమ్ (జుూ) రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్ (ఞూ) పునరుద్ధరించాలని, 2004కు ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉద్యోగులకు వెంటనే ఓపిఎస్ అమలు చేయాలని పేర్కొన్నారు. అలాగే దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 64 సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో వివిధ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మిక సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు.



## బీసీ మహిళా జేఏసీ చైర్మన్ జయంతి గౌడ్ దీక్షను భగ్నం చేసి నిమ్స్ కు తరలింపు

**జయంతి గౌడ్ దీక్షకు మద్దతు తెలిపిన కోదండరాం**



ఎల్బీనగర్, ఏప్రిల్ 17 (నగర నిజం): చట్టసభలలో మహిళా రిజర్వేషన్లలో ఓబీసీలకు సబ్‌కోటా కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న బీసీ మహిళా సంఘాల జేఏసీ చైర్మన్ మట్ట జయంతి గౌడ్‌కు తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం మద్దతు తెలిపారు. హిమాయత్‌నగర్‌లోని బీసీ కార్యాలయంలో కొనసాగుతున్న దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి జయంతి గౌడ్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న మహిళా బిల్లులో ఓబీసీలకు తగిన ప్రాధాన్యం కల్పించాలని, ఇప్పటికే తీసుకువచ్చిన చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. ఇదిలా ఉండగా, నాలుగు రోజులుగా కొనసాగుతున్న దీక్షను పోలీసులు భగ్నం చేసి జయంతి గౌడ్‌ను అరెస్ట్ చేసి నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అయితే, తాను దీక్షను విరమించబోనని, బీసీ మహిళలకు సబ్‌కోటా అమలు అయ్యే వరకు ఆసుపత్రిలోనే దీక్ష కొనసాగిస్తానని జయంతి గౌడ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్, తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఏం నరసయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నిజ్జన రమేష్ ముదిరాజ్, పల్లె వినయ్ కుమార్ గౌడ్, బీసీ జన సమితి కన్వీనర్ జస్వంత్ కుమార్, మహిళా జన సమితి కార్యనిర్వహక కార్యదర్శి పుష్పనీలా గౌడ్, యువజన సమితి అధ్యక్షుడు సలీం భాష, విద్యార్థి జన సమితి అధ్యక్షుడు అరుణ్ కుమార్, నగర ఉపాధ్యక్షుడు జయపాల్ రెడ్డి, ముషీరాబాద్ నాయకులు కాంగ్రెస్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



నగరనిజం
18 శనివారం,ఏప్రిల్,2026

## యూడిఐడి కార్డులను సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



ఎల్బీనగర్, ఏప్రిల్ 17 (నగర నిజం): అంగవైకల్యంతో బాధపడుతున్న వారు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న యూడిఐడి కార్డులను సద్వినియోగం చేసుకోవాలని ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సూచించారు. ఆయన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన యూడిఐడి కార్డుల పంపిణీ కార్యక్రమంలో పలువురు దివ్యాంగులకు కార్డులను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అర్హత ఉన్న ప్రతి దివ్యాంగుడు యూడిఐడి కార్డు పొందడం ద్వారా ప్రభుత్వం అందించే పలు సంక్షేమ పథకాలను సులభంగా పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ యువ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, శివప్రకాష్, గ్రేటర్ హైదరాబాద్ దివ్యాంగుల సంఘం అధ్యక్షులు మందా బిక్షపతి యాదవ్, ఎల్బీనగర్ మహిళా అధ్యక్షురాలు వర్రాల భాగ్యలక్ష్మి, సిద్ధం నర్సింగ్, పద్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి సందర్భంగా పారిశుద్ధ కార్మికులకు ఘన సన్మానం






ఎల్బీనగర్, ఏప్రిల్ 17 (నగర నిజం): భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నియోజకవర్గం బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ ఎన్జీవోస్ కాలనీలోని జిల్లా కార్యాలయంలో డా. బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా పదవీ విరమణ చేసిన జిహెచ్ఎంసి పారిశుద్ధ కార్మికులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి, డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్రీధర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదవీ విరమణ చేసిన పారిశుద్ధ కార్మికుల పాదాలను నీటితో కడిగి, వారికి చీరలను బహుమతిగా అందజేసి వారి సేవలను గౌరవించారు. ఈ సందర్భంగా లచ్చి రెడ్డి మాట్లాడుతూ, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ కార్మికులు కీలక పాత్ర పోషించారని, వారి సేవలను గుర్తించి సన్మానించడం ఎంతో అభినందనీయమని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి వర్గానికి సమాన గౌరవం లభించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శులు కల్లు విష్ణువర్ధన్ రెడ్డి, ప్రేమ్ నాథ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మహేష్ గౌడ్, బీజేవైఎం అధ్యక్షుడు సురేష్ కుమార్, నాయకులు శ్రీనివాస్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులపై నిరసన: జిడిసి హయత్‌నగర్ సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో ఆందోళన



హయత్‌నగర్, ఏప్రిల్ 17 (నగర నిజశ్): ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపులో జరుగుతున్న జాప్యానికి నిరసనగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల (జిడిసి) హయత్‌నగర్ సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో ఆందోళన చేపట్టారు. టి.జి.ఇ.జె.ఎ.సి ఇచ్చిన పిలుపు మేరకు ప్రిన్సిపాల్, అధ్యాపకులు మరియు బోధనేతర సిబ్బంది కళాశాల ప్రవేశ ద్వారం వద్ద శాంతియుతంగా నిరసన తెలిపారు. జీతాలు, బకాయిలు మరియు ఇతర అలవెన్సులతో సంబంధించి పెండింగ్ బిల్లుల విడుదలలో జరుగుతున్న అసాధారణ ఆలస్యం తమకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు కలిగిస్తోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. విద్యా కార్యకలాపాలకు ఎటువంటి అంతరాయం కలగకుండా మధ్యాహ్న భోజన విరామ సమయంలోనే ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషం.

## దోమలపై యుద్ధం: 11వ రోజు బిఆర్ఎస్ ఫాగ్గింగ్ డ్రైవ్



ఎల్బీనగర్, ఏప్రిల్ 17 (నగర నిజం): పెరుగుతున్న దోమల సమస్యపై స్పందిస్తూ బిఆర్ఎస్ నాయకులు చైతన్యపురి డివిజన్‌లో 11వ రోజు ఫాగ్గింగ్ కార్యక్రమాన్ని కొనసాగించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నాయకులు తెలిపారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సూచనల మేరకు, ప్రజల ఆరోగ్య రక్షణను లక్ష్యంగా పెట్టుకుని బిఆర్ఎస్ నాయకుడు చంద్రశేఖర్ రెడ్డి తన సొంత ఖర్చులతో వికాస్ నగర్, హనుమాన్ నగర్, చైతన్యపురి ప్రాంతాల్లో ఫాగ్గింగ్ నిర్వహించారు. ప్రజల్లో వ్యాధులపై అవగాహన పెంచుతూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో జలంధర్, పులి కిరణ్, సాయి, శ్రీధర్, చింటు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# అందరూ కలిసి ఆమె"ను ఓడించారు....!

## మహిళా బిల్లు వీగిపోవడానికి తిలా పాపం తలపిడికెడు అన్న చందంగా వ్యవహరించిన అధికార,విపక్ష పార్టీలు

### రాజకీయ చదరంగంలో మళ్లీ ఒంటరైన "మహిళ"





రాజేంద్రనగర్, ఏప్రిల్ 17(నగరనిజం ప్రతినిధి):మహిళా బిల్లు వీగిపోవడానికి కారణం నువ్వంటే నువ్వు అని అధికార, విపక్ష పార్టీలు ఒకరిపై మరొకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. కానీ మహిళా బిల్లు వీగిపోయిన తీరును క్షుణ్ణంగాపరిశీలించి చూస్తే.....రాజకీయ చదరంగంలో ఓడిపోయింది మహిళే....."ఆమె"ను ఓడించింది రాజకీయ పార్టీలే అన్న విషయం తేటతెల్లమైంది.....మహిళా బిల్లును ఓడించింది ఎవరు....? గెలిపించింది ఎవరు...?.... మహిళా బిల్లు వీగిపోయిన అంశాన్ని లోతుగా పరిశీలించి చూస్తే కొన్ని నమ్మలేని చేదు నిజాలు తేటతెల్లమవుతున్నాయి.






తిలాపాపం తలా పిడికెడు అన్న చందంగా మహిళా బిల్లును ఆమోదిస్తే నాకేంటి...? అనే స్టాటజీని అన్ని పార్టీలు ఫాలో అవుతున్నట్లుగా అందరికీ విషయం స్పష్టమవుతోంది. 1996 నుండి 2026 వరకు కూడా మహిళా బిల్లు ఆమోదానికి సంబంధించి రాజకీయ పక్షాలు అవలంబిస్తున్న తీరు పై అందరికీ అనుమానాలను రేకెత్తిస్తోంది. 1996 లో హెచ్.డి దేవే గౌడ ప్రభుత్వం తొలిసారిగా పార్లమెంటులో మహిళా బిల్లును ప్రవేశపెట్టి ప్రతిపక్షాల మద్దతు లేక ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. ఆ తరువాత 2008 లో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం సైతం ఇదే తరహాలో పార్లమెంటులో మహిళా బిల్లును ప్రవేశపెట్టినప్పటికీ అదే చేదు అనుభవాన్ని ఎదుర్కోక తప్పలేదు. కాగా 2023 లో నూతన పార్లమెంటు భవన్ వేదికగా మోడీ ప్రభుత్వం నారీ శక్తి వందన్ అధినీయం (128వ రాజ్యాంగ సవరణ బిల్లు) గా ప్రవేశపెట్టినప్పటికీ ఆమోదం పొందలేక మోడీ ప్రభుత్వం చేతులెత్తేయాల్సి వచ్చింది. తాజాగా మహిళలపై ఎక్కడా లేని ప్రేమలను ఒలకకబోస్తూ అన్ని పార్టీలు పార్లమెంటు గడప దాకా మహిళా బిల్లును తీసుకొచ్చినప్పటికీ రాజకీయ ప్రయోజనాల కోసం అధికార, విపక్ష పార్టీలు అన్నీ కలిసి నా రూటే సపరేటు చందంగా వ్యవహరించాయి అని నిందించక తప్పదు. విపక్షాలు లేవనెత్తిన అంశాన్ని ఒక్కసారి పరిశీలించి చూస్తే.... డిలిమిటేషన్ తో ముడి పెట్టకుండా మహిళా బిల్లును ప్రవేశపెడితే మేమంతా బిల్లుకు మద్దతు ఇస్తాం అంటూ విపక్ష పార్టీలు గుంతెత్తి చాటాయి. కానీ అధికార పక్షం పంతాలకు పోయి మా రూటే సపరేటు అన్న చందంగా మూడు బిల్లులను ఒకేసారి ప్రవేశపెట్టడంతో విపక్షాలన్నీ మోడీ ప్రభుత్వ నిర్ణయం పై తిరుగుబాటు జెండా ఎగురవేసాయి. ఫలితం..... చిత్తశుద్ధి అనే అంశాలపై లోతుగా పరిశీలిస్తే మహిళా బిల్లు ఆమోదానికి సంబంధించి అధికార, విపక్ష పార్టీల చిత్తశుద్ధి పై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. ఒకవేళ నరేంద్ర మోడీ ప్రభుత్వానికి మహిళా బిల్లుపై చిత్తశుద్ధి ఉంటే ప్రతిపక్షాలు కోరినట్లుగా మిగతా బిల్లులను పక్కన పెట్టి మహిళా బిల్లును ప్రవేశపెట్టి ఉంటే అప్పుడు విపక్షాల నిజ స్వరూపం బయటపడేది. కానీ ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు అందంగా అటు అధికార పక్షం... ఇటు విపక్షం దొందు దొందే అన్న చందంగా వ్యవహరించడంతో మహిళా బిల్లు ఆమోదం విషయంలో గెలిచింది ఎవరూ.....ఓడింది ఎవరూ.... అందరూ కలిసి ఓడించింది ఎవరినీ అన్నది లారీ లోకానికి ఇప్పటికే అర్థం కావడం లేదు.






## అమావాస్య వేళ అన్నదాన సేవలు ఎల్బీనగర్‌లో భక్తి, సేవా సమన్వయం





ఎల్బీనగర్, ఏప్రిల్ 17 (నగర నిజం): అమావాస్య సందర్భంగా ఎల్బీనగర్ పరిధిలో భక్తిశ్రద్ధల మధ్య అన్నదాన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించబడ్డాయి. పలు ప్రాంతాల్లో నాయకులు, సేవా సంస్థలు ముందుకు వచ్చి భక్తులకు అన్నప్రసాదం అందించారు. కమర్షియల్ టాక్స్ కాలనీలోని మైసమ్మ దేవాలయం వద్ద బీజేపీ నాయకుడు ఊరెళ్ళి రామకృష్ణ ఆధ్వర్యంలో అన్నదానం జరగగా, మోహన్ నగర్‌లో శ్రీ సేవా సమితి ఆధ్వర్యంలో ఉపేందర్ సింగ్ ఠాకూర్ కార్యక్రమం నిర్వహించారు. మారుతి నగర్‌లో నవీన్ చారి మరియు మిత్ర బృందం కూడా సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా కొత్తపేట మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, అన్నదానం ద్వారా సమాజంలో సేవా భావం పెంపొందుతుందని, ఇలాంటి కార్యక్రమాలు సమాజ ఐక్యతకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకుడు బొగ్గారపు శరత్ చంద్రతో పాటు బీజేపీ నాయకులు సురేందర్, గట్టు మహేష్ కుమార్ పాల్గొన్నారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

## రోడ్డు భద్రతపై అవగాహన పెంపు అవసరం
## నాగోల్‌లో "అరైవ్-అలైవ్" ప్రారంభం



ఎల్బీనగర్, ఏప్రిల్ 17 (నగర నిజం): రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించడం ద్వారా మాత్రమే ప్రమాదాలను తగ్గించవచ్చని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి కార్యక్రమాల్లో భాగంగా నాగోల్‌లోని బాబు జగ్జీవన్ రామ్ రవాణా కార్యాలయంలో నిర్వహించిన "అరైవ్-అలైవ్" కార్యక్రమాన్ని మంత్రి మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని కూడా ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ, చిన్నపాటి నిర్లక్ష్యమే ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తోందని, అలాంటి ఘటనల వల్ల అనేక కుటుంబాలు నష్టపోతున్నాయని అన్నారు. ప్రభుత్వ చర్యలతో పాటు ప్రజల్లో అవగాహన పెరగడం అత్యవసరమని పేర్కొన్నారు. "అరైవ్-అలైవ్" కార్యక్రమం ద్వారా పాఠశాలలు, కళాశాలలు, ముఖ్య కూడళ్ల వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణ సహాయం అందించే వారికి "రహవీర్" పథకం కింద రూ.25,000 నగదు బహుమతిని అందిస్తున్నామని, బాధితులను ఆసుపత్రికి తరలించే వారికి ఎటువంటి చట్టపరమైన ఇబ్బందులు ఉండవని మంత్రి స్పష్టం చేశారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్లే ప్రమాదాలు పెరుగుతున్నాయని, ప్రతి సంవత్సరం వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్లు తమ ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ జోన్ డిసిపి అనురాధ, ట్రాఫిక్ డిసిపి శ్రీనివాసరావు, ఆర్టీఏ అధికారులు, పోలీస్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పోషణ పక్వాడ కార్యక్రమం ఘనంగా నిర్వహణ



వలిగొండ, ఏప్రిల్ 17:( నగర నిజం)యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని వర్కట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పి.హెచ్.సి) ఆధ్వర్యంలో వర్కట్‌పల్లి గ్రామంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీఓ సమీరా మేడం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషణ పక్వాడ కార్యక్రమం ద్వారా మహిళలు, పిల్లల ఆరోగ్యంపై అవగాహన కల్పించడం ముఖ్య లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు మరియు తల్లులు ఐరన్ లోపం లేకుండా పౌష్టికాహారం తీసుకోవాలనిసూచించారు. పిల్లల ఎదుగుదలలో మైల్‌స్టోన్‌లను గుర్తించి, సరైన సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.
కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ జ్యోతి మేడం, సర్పంచ్ రమణమ్మ, జనార్దన్ రెడ్డి, హెల్త్ సూపర్వైజర్ సుకన్య, స్కూల్ హెడ్‌మాస్టర్ బాలయ్య, సెక్రటరీ సురేష్ రెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ పారిజాత, హెచ్ఈఓ వెంకటరమణ, ఏఎన్ఎం, జిఎన్ఎమ్ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు మరియు గ్రామంలోని తల్లులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజల్లో పోషకాహారంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా అధికారులు పేర్కొన్నారు.

# బైపిసి మొదటి సంవత్సరంలో స్టేట్ ఫస్ట్ సాధించిన పిడమర్తి అష్మిత




చిక్కడపల్లి/ నగర నిజం : చిక్కడపల్లిలోని న్యూ ఎరా జూనియర్ కాలేజ్ లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపిసి చదువుకుంటున్న పిడమర్తి అజయ్ కుమార్, గీత దంపతుల కుమార్తె పి. అష్మిత ఇటీవల వెలువడిన పరీక్ష ఫలితాల్లో 440 మార్కులకు గాను 438 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ గా నిలిచింది. ఈ సందర్భంగా కాలేజ్ ప్రిన్సిపల్ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో పి. అష్మితను పుష్పగుచ్చాలతో సన్మానించి బానసంచాలతో వేడుకగా నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపల్ డాక్టర్ శ్రావణ్ కుమార్ ఆమెకు అభినందనలు తెలుపుతూ ఇలాగే కష్టపడి మంచి మార్కులు తెచ్చుకొని జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అష్మిత స్టేట్ ఫస్ట్ ర్యాంకు రావడం మాకు చాలా ఆనందంగా ఉందని అన్నారు. చదువు పట్ల అష్మితను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు.